# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 03-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది.
- దేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడానికి.. సైనిక, పౌర విభాగాల మధ్య మరింత సమన్వయం అవసరమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
- నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఆందోళనల కారణంగా నిరసనకారులపై నమోదైన కేసులను చట్ట ప్రకారం ఉపసంహరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి స్వేచ్ఛ ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.
- ఢిల్లీ, హర్యానా, చండీఘర్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ లతో సహా పలు రాష్ట్రాలలో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.

==============================

సుప్రీం కోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన `సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026`కు లోక్ సభ ఈరోజు ఆమోదం తెలిపింది. భారత ప్రధాన న్యాయమూర్తిని మినహాయించి న్యాయమూర్తుల సంఖ్యను 34 నుండి 38కి పెంచేందుకు ఈ బిల్లు ఉద్దేశించబడింది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ మధ్యాహ్నం బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా విపక్ష సభ్యులు పదే పదే నినాదాలు చేయగా బిల్లుపై చర్చలో పాల్గొనాలని సభ్యులను స్పీకర్ ఓం బిర్లా కోరారు. విపక్షాల నిరసనలతో బిల్లుపై చర్చించకుండానే స్పీకర్ ఆమోదించారు. అనంతరం సభను రేపటికి వాయిదా వేశారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెంపు విషయంపై గత మే నెలలోనే కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దానిని కార్యరూపంలోకి తీసుకొస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము `ద సుప్రీం కోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్మెంట్ ఆర్డినెన్స్-2026`ను జారీ చేశారు. ఈ ఏడాది జారీ చేసిన తొలి ఆర్డినెన్స్ ఇదే. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950 జనవరి 26వ తేదీన 8 మంది న్యాయమూర్తులతో ప్రారంభమైన సర్వోన్నత న్యాయస్థానం 76 ఏళ్లలో సంఖ్యాపరంగా 30కి, నిష్పత్తి ప్రకారం 375 శాతం పెరిగినట్లయింది.

==============================

పార్లమెంటులోని ముఖ్యమైన బిల్లులపై చేపట్టిన చర్చల్లో ప్రతిపక్షాలు పాల్గొనడం లేదని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. పార్లమెంట్ వెలుపల ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... ఈ రోజు లోకసభలో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026 ఆమోదం పొందినప్పటికీ, ప్రతిపక్ష పార్టీల నుండి ఏ సభ్యుడూ చర్చలో పాల్గొనలేదని అన్నారు. అదే విధంగా, రాజ్యసభలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు-2026 ఆమోదం పొందిందని, అయితే ఈ చర్చలో కూడా ప్రతిపక్షం పాల్గొనలేదని మంత్రి అన్నారు. పార్లమెంటు వెలుపల ఉన్న ప్రతిపక్ష సభ్యులు తమను సభలో మాట్లాడటానికి అనుమతించడం లేదని ఆరోపిస్తున్నారని, కానీ అవకాశం ఇచ్చినప్పుడు మాట్లాడటానికి ఇష్టపడటం లేదని కిరణ్ రిజిజు వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడానికి, సైనిక, పౌర విభాగాల మధ్య మరింత సమన్వయం అవసరమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇది నిరంతరం మారుతున్న భద్రతా, సాంకేతిక సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఈరోజు 85వ సాయుధ దళాల ప్రధాన కార్యాలయం పౌర సేవల దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగిస్తూ... సైనిక, పౌర సేవలు రెండూ `దేశమే ప్రథమం` అనే నిబద్ధతను పంచుకుంటాయని, ఏకైక లక్ష్యమైనప్పుడు వ్యవస్థలోని ప్రతి అంశం జాతీయ బలంగా రూపాంతరం చెందుతుందనిన్నారు. సైనిక, పరిపాలనా, సమైక్యత వేర్వేరు మార్గాల్లో సాగలేదని కేంద్రమంత్రి తెలిపారు. ఉమ్మడి, సమీకృత నిర్మాణాలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ విధానం, పరిపాలన, మానవ వనరుల నిర్వహణ తదితర రంగాలలో నైపుణ్యం అవసరమవుతాయన్నారు. ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, అభివృద్ధిపరమైన నియామకాల ద్వారా పౌర, సైనిక అధికారుల మధ్య క్రమబద్ధమైన పరస్పర అవగాహనను మరింత పెంచాల్సిన అవసరాన్ని రాజ్ నాథ్ సింగ్ వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఆందోళనల కారణంగా నిరసనకారులపై నమోదైన కేసులను చట్ట ప్రకారం ఉపసంహరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి స్వేచ్ఛ ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం, `నేర చరిత్ర` ఉన్న నిరసనకారులపై విచారణకు అనుమతిస్తూ.. జులై 28న ఇచ్చిన ఉత్తర్వు.. కేవలం తీవ్రమైన, హేయమైన నేరాలకు పాల్పడిన వారికి మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. జులై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలకు సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాశనం ఈ వ్యాఖ్యలు చేసింది. దీంతో వివిధ రాష్ట్రాల్లో కేసులు ఎదుర్కొంటున్న వారికి ఊరట లభించనుంది. చిన్న చిన్న కేసులు ఎదుర్కొంటున్న వారిని ఆ కోవలో చూడరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. నిరసనలకు సంబంధించిన అంశాలపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కోర్టు తెలిపింది. పెల్లెట్ తుపాకుల వినియోగంపై సమగ్ర మార్గదర్శకాలు రూపొందిస్తామని వివరించింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 19కి వాయిదా వేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గ్లాస్గోలో జరిగిన 23వ కామన్వెల్త్ క్రీడలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులకు లోకసభ ఈరోజు అభినందనలు తెలిపింది. సభా కార్యకలాపాలు ప్రారంభ సమయంలో స్పీకర్ ఓం బిర్లా భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారని, 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలతో కలిపి మొత్తం 39 పతకాలు గెలుచుకుని, పతకాల పట్టికలో నాల్గవ స్థానాన్ని దక్కించుకున్నారని చెప్పారు  భారత మహిళా క్రీడాకారులు అసాధారణ ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రదర్శించి.. 8 స్వర్ణ పతకాలతో సహా మొత్తం 16 పతకాలు గెలుచుకున్నారని తెలిపారు. ఈ అద్భుతమైన ప్రదర్శన

దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువతకు, క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందన్నారు. తదుపరి కామన్వెల్త్ గేమ్స్ 2030లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతాయని స్పీకర్ తెలిపారు. నిన్న జరిగిన ముగింపు వేడుకల అనంతరం కామన్వెల్త్ గేమ్స్ బాటన్‌ను అధికారికంగా భారతదేశానికి అప్పగించారని ఓం బిర్లా వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==============================

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఈ ఏడాది జూలైలో అత్యధిక నెలవారీ లావాదేవీలను నమోదు చేసింది. ఇందులో భాగంగా 29.88 లక్షల కోట్ల రూపాయల విలువైన 23.66 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. ఈ ఘనత భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని ప్రధానమంత్రి కార్యాలయం సామాజిక మాధ్యమం పోస్ట్‌లో పేర్కొంది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో యూపీఐ వినియోగం వేగంగా విస్తరించడం దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ విస్తరణకు నిదర్శనమని తెలిపింది.

==============================

వివిధ రాష్ట్రాల పరిధిలోని బంకిపూర్, మంజల్‌పూర్, దతియా అసెంబ్లీ నియోజక వర్గాల ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయింది. గుజరాత్‌లోని వడోదర జిల్లా మంజల్‌పూర్ కు జరిగిన ఉప ఎన్నికలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి సతేంద్రభాయ్ పటేల్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భిఖాభాయ్ రబారిపై 30 వేలకు పైగా ఓట్ల తేడాతో ఈ విజయం సాధించారు. ఇక బీహార్ లోని బంకిపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో జన్ సూరజ్ పార్టీ అభ్యర్థి ప్రశాంత్ కిషోర్ విజయం సాధించారు. తొలి రౌండ్ నుంచి ఆధిక్యం ప్రదర్శించిన ఆయన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ పై 18,964 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. బీజేపీ నాయకులు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నికైన నేపథ్యంలో ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించారు. అలాగే మధ్యప్రదేశ్‌లోని దతియా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఘనశ్యామ్ సింగ్ విజయం సాధించారు.

==============================

అరుణాచల్ ప్రదేశ్, బీహార్, ఉప హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కింలలో ఈరోజు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రేపు ఢిల్లీ, హర్యానా, చండీఘర్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, జార్ఖండ్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కోస్తాంధ్ర, కేరళం, మాహే, లక్షద్వీప్, ఉత్తర కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, అండమాన్ నికోబార్ దీవులలో ఈరోజు, రేపు ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. అలాగే కేరళం రాష్ట్ర వ్యాప్తంగా అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరిక జారీ చేసింది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, తిరువనంతపురం, కొల్లాం మినహా అన్ని జిల్లాల్లోని విద్యా సంస్థలకు అధికారులు ఈరోజు సెలవు ప్రకటించారు.

==============================

ఆల్ ఇండియా కోటా కింద MBBS, ఇతర అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యా కోర్సులలో ప్రవేశాల కోసం మొదటి విడత కౌన్సెలింగ్ రేపు ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 8న 2026-27 బ్యాచ్ విద్యా సంవత్సరం మొదలవుతుంది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (MCC) విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీల కోసం మొదటి రౌండ్ కౌన్సెలింగ్ ఈనెల 4 నుండి 17వ తేదీ వరకు జరుగుతుంది. రెండవ విడత కౌన్సెలింగ్ ఆగస్టు 24 నుండి సెప్టెంబర్ 2 వరకు, ఆ తర్వాత మూడవ విడత సెప్టెంబర్ 10 నుండి సెప్టెంబర్ 18వ తేదీ వరకు జరుగుతుంది.

==============================
==============================